## 180. నిజమైన భక్తుడు

ఓ సారి నారదుడు వైకుంఠానికి వెళ్ళాడు. ఎప్పటిలా శేషపాన్పు మీద పవళించిన విష్ణుమూర్తి కనబడలేదు. దాంతో లక్ష్మీదేవిని అడిగాడు.

"అమ్మా! విష్ణుమూర్తి ఏరి?"

"ఆయన అర్చన చేస్తున్నారు." జవాబు చెప్పింది లక్ష్మీదేవి.

త్రిలోకాల్లోని వారి చేత అర్చన చేయించుకునే ఆయన ఎవరికి అర్చన చేస్తున్నారో కుతూహలం కలిగిన నారదుడు విష్ణువు వున్న చోటికి వెళ్ళాడు. బంగారు పాత్రలోని గంగాజలాన్ని దక్షిణావృత శంఖంతో తులసి మాలలు అలంకరించిన చిన్న దంతం పెట్టెకి అభిషేకం చేసే విష్ణువుని చూసి అడిగాడు నారదుడు.

"స్వామీ! నీ కన్నా గొప్ప దేవుడు ఎవరున్నారు? ఆ పెట్టెలో ఏముంది?"

"ఇందులో నా భక్తుల పాద ధూళి వుంది." జవాబు చెప్పాడు విష్ణువు.

## 181. దయ

ఓ గ్రామంలో ఓ సన్యాసి తరచు తమ వీధిలోని వృద్ధురాలైన ఓ విధవరాలి దగ్గరకి వెళ్ళి వారింటి అరుగు మీద కూర్చుని, ఆవిడ చెప్పే కబుర్లు వినడం ఓ పెద్ద మనిషి చూసాడు. ఆవిడ చెప్పే పాతకాలం కబుర్లు ఏ మాత్రం ఆసక్తిగా వుండవు. కాబట్టి ఎవరూ ఆవిడ దగ్గరకి వచ్చేవారు కారు. సన్యాసికి కూడా ఆ కబుర్లు రుచించడం లేదని అతను అవి వింటూ అనేకసార్లు ఆవులించడాన్ని బట్టి ఆ పెద్దమనిషి గ్రహించాడు. ఐనా ఆవిడ దగ్గరకి నిత్యం ఓ గంట సేపు వచ్చి కబుర్లు వినడం చూసి ఆశ్చర్యం కలిగిన ఆ పెద్ద మనిషి సన్యాసిని అడిగాడు.

"ఆవిడ చెప్పే విషయాలు మీకేమైనా ఆసక్తిగా వున్నాయా?"

"లేవు." జవాబు చెప్పాడు సన్యాసి.

"మరి మీ విలువైన కాలాన్ని ఆవిడ దగ్గర కూర్చుని ఎందుకు వృథా చేసుకుంటున్నారు?"

"దాన్ని దయ అంటారు. భగవత్ భక్తులు దయగా జీవించాలి కాబట్టి." జవాబు చెప్పాడు సన్యాసి.

## 182. కదలద్దు

ఓ తాత్వికుడు దగ్గరకి కొందరు జిజ్ఞాసువులు వెళ్ళి అతన్ని ఏదైనా ఉపదేశం చెప్పమని కోరారు. అటూ, ఇటూ పచార్లు చేస్తున్న ఆయన కొద్దిసేపు ఆలోచించి కూర్చున్న వాళ్ళతో చెప్పాడు.

"కదలకండి."

"అదేమిటి? మేమెవరం నడవడం లేదు. కూర్చునే వున్నాం. మీరు కదా నడిచేది?" అర్థంకాక అడిగారు వాళ్ళు.

"నా కాళ్ళు కదులుతున్నాయి. కానీ నా మనసు నిశ్చలంగా వుంది. మీ కాళ్ళు నిశ్చలంగా వున్నా, మీ మనసు అన్ని వేళలా ఆశతో, ద్వేషంతో, కోపంతో, సంతోషంతో, దుఃఖంతో, కోరికలతో కదులుతూనే వుంది. నా మనసు విషయంలో నేను నిశ్చలంగా వున్నట్లుగా మిమ్మల్నీ ఉండమంటున్నాను." వివరించాడు ఆ తాత్త్వికుడు.

## 183. ఏకాగ్రత

కొత్తగా ఓ మఠంలో చేరిన ఒకతను ధ్యాన సమయంలో కళ్ళు మూసుకుని దేవుడ్ని మనో నేత్రంతో చూసే ప్రయత్నం చేసేవాడు. ప్రధాన శిష్యుడు ధ్యానం చేసే మిగిలిన శిష్యుల దగ్గరకి వచ్చినప్పుడు వారంతా ఆయన పాదాలకి నమస్కారాలు చేసేవారు. కొత్త శిష్యుడు ఈ పని చేయకపోవడంతో మిగిలిన శిష్యులు గురువుకి అతని మీద ఫిర్యాదు చేసారు. గురువు అతన్ని పిలిపించి ఆ ఫిర్యాదుని ప్రస్తావించి అడిగాడు.